# ౧ కన్నప్ప కల

"కన్నప్ప కల" అంటే నేను 1-1-1937 న పగలు గావించిన శ్రీకాళహస్తి దివ్యక్షేత్ర యాత్ర అని అనుకోండి. 'కన్నప్ప' అంటే నేనే. 'కల' అంటే ఆ నాటి యొక్క యాత్రే. వేఱే యెవడో కన్నప్ప అనే మనిషి వుండేవాడు. ఆ మనిషి నిద్రపోతూ ఎప్పుడో అర్ధరాత్రి నెదో కల గన్నాడు. ఆ కలను నేనేమో అతి విడ్డూరంగా వర్ణించి చెప్తాను అని కొండంత ఆస పెట్టుకోబోకండి పాఠకులు!

'యాత్ర' అంటే కల ఏలా అవుతుందీ అని సందేహిస్తారేమో యెవరైనా? యాత్రకూ కలకూ పోలికలు చాలా వున్నాయి. ఇల్లూ వాకిలీ మఱచిపోతాం, పొడుగుతా వింతవింతలు తిలకిస్తాం, సొంతం అవుతుందో లేదో అని అడుగడుక్కీ సంశయిస్తూనే వుంటాం. కాకపోతే చెప్పండీ! బెజవాడకు నెం॥ 32 వాల్తేరు ప్యాసెంజరు సరిగ్గా 19-15 కు వచ్చిన బండి, అసలు గూడూరు తెల్లవాఱగట్ల 4-46 కు చేరవలసింది, తెల్లవారి 7 గంటలకు చేరడ మేమిటి చెప్పండీ! అవతల దాని పుణ్యమా అంటూ కాట్పాడి పొయ్యే బండిని ఆ గార్డో, డ్రైవరో, ఆ కాళహస్తీశ్వరుడో, మఱో అరగంట ఆపుచేయబట్టి అనుకొన్న ప్రయాణం అనుకొన్నట్టు జరిగింది కాని, లేకపోతే నా యాత్ర ఏం కావలసింది? సగం

కలలో లేచి కూర్చుని, మన యింటి సరంబీమీది చప్పుడని అనుకున్న ట్టుండిపోయేది.

ఇన్నాళ్లై ఇన్నిసార్లు చెన్నపట్నం వెళ్తూ వస్తూ వున్నవాణ్ణి, ఈ పాతిక ముప్ఫై యేళ్ళనుంచీ ఒక పర్యాయమన్నా గూడూరువద్ద దిగి రేణిగుంట దారి ఎందుకు పట్టాను గాదు; ఇంత అందంగా, ఇంత చిత్ర విచిత్రంగా వుందే అని అనుకున్నాను. రైలుబండి వెడుతూ వెడుతూ గంట గంటన్నరలో 'వెంకటగిరి' పట్నాన్ని ఓ లోయలో దోబూచు లాడిస్తూ వుంటే, ఆ పట్నానికి చేరువనే గల కొండ చాలా దూరం వఱకూ నా దృష్టి నాకర్షిస్తూనే వచ్చింది. ఎక్కడ మాయమైందో అది ఇప్పుడు చెప్పలేను! గాని ప్రక్కకు తిరిగి చూచేలో గమ్యస్థానం కాళహస్తి కనిపించింది. ఇంగ్లీషు పేరు సరిగ్గా 'కాళహస్తి' అని వ్రాయబడి వున్నా తెనుగు పేరు 'కాళహస్త్రి' అని వ్రాయబడి వున్నట్టు నాకు జ్ఞాపకం. శ్రీకాళహస్తి, కాళహస్తిశ్రీ, కాళహస్త్రి, కాళాస్త్రీ, కళాస్త్రీ, ఇలా భాష కెంతెంత మార్పులు వస్తూయున్నా గాథకు మార్పులుండవు.

గాథ సరిగ్గా నేను వింటూ వచ్చినట్టుగానే గుళ్లో చెప్పబడింది. "శ్రీ = సాలెపురుగు, కాళ = సర్పము, హస్తి = ఏనుగు, ఈ మూడున్నూ పూజచేసేవట ఆదిని అక్కడ ఆ మహా లింగాన్ని. అందుచేత శ్రీకాళ హస్తీశ్వరుడు అనే నామకరణం వచ్చింది." అని ఎన్నిసార్లు నిర్వచిం చాడో నే నిప్పుడు చెప్పలేను. పదిసార్లు అయినా చెప్పి వుంటాడు గుడి అంతా మాకు చూపెట్టినతడు.

శ్రీ = సాలెపురుగు, కాళ = సర్పము, హస్తి = ఏనుగు—అంటే అదంతా మొదట్లో ఆ మూడింటి యొక్క ఆవాసమూ అన్నమాట. పెద్ద

అడివి అని వేఱే చెప్పక్కర్లేదు. ఆ అడివిలో వో సన్నని నది సువర్ణ ముఖ అనేది ప్రవహిస్తూ వుండేది. ఇప్పటికీ వుంది ఆ నది. దాని చిత్రమేమిటంటే అది ఆ గుడి కట్టిన తావునుండి ఉత్తరాభిముఖంగా ప్రవహిస్తూ కనబడుతుంది. భారత వర్షంలో ఉత్తరాభిముఖంగా ప్రవహించే నది అది వొక్కటే అవడంచేత అది మిక్కిలీ పుణ్యవంతమైన మహా ప్రవంతిగా పేరెన్నిక గాంచినది. నీటిలో ఆకుపచ్చని నాచు కలసి వున్నా, ఆ నాచు ముక్క ముక్కలుగా విడిపోయి నీటికి నీరు, నాచుకు నాచూ అన్నటు నీరు పైకెత్తితే నిర్మలంగానే తోచింది. నీటి మీదనో వంతెన కట్టబడి వుంది కాని, మనుష్యులకంటె గొఱ్ఱెలే మెఱుగన్నట్టు గొఱ్ఱెలమంద వొకటి వంతెనకు దిగు చాయగా నీళ్ళల్లోదిగి నడచి పోవడం ఎక్కువ వినోదవంతంగా నాకు గోచరించింది. బహుశా కన్నప్పఅనే అతను ఆ దారమ్మటే నదిని దాటి పూర్వకాలంలో పుట్టు లింగాన్ని సందర్శించి వుండాలి అని తలపోశాను.

'కన్నప్ప! కన్నప్ప!' అని వూరికే అంటే చాలదు. బోయ కన్నప్ప! బోయకన్నప్ప! వందకు పైగా నాకు క్రింద గుళ్లో ఇతర విగ్రహాలు చూపించబడ్డా, వేలకుపైగా మించి గోపురంమీది బొమ్మలు పతాకాల్లా గగపించినా, కొండమీద ప్రత్యేకించి సాక్షాత్కరించిన బోయ కన్నప్ప నిలువు విగ్రహముండే అది సోయగం వొలికించినట్టు మరే విగ్రహం వొలికించలేదు. విల్లు పట్టి ఆ విగ్రహం నిలువునా కనిపించగానే, బోయకన్నప్ప సజీవుడై చైతన్యంతో ఎట్ట యెదుట నిలుచున్నట్టే వుండిపోయింది నామనోవీథిని. బోయకన్నప్ప యొక్క ధనుష్టంకారము కికారణ్యం మీదుగా కొండలోయల్లో ప్రతిధ్వనిస్తూ సువర్ణముఖి యొక్క చిన్న యలల బిలబిల ధ్వనులలో లీనమై శాంతించినట్టు నా వీనులకు సోకింది.

బోయకన్నప్ప వింటినారి లాగి అమ్ము వదలుతూంటే అడివిలో శరభ శార్దూల, సింహ, భల్లూక, లులాయ గోలాంగూలాలు, చెల్లాచెదరై పాఱిపోయి, ఎక్కడ సందు చిక్కితే అక్కడే నక్కిపోసాగినవి. అత గాని మహదాశయము జంతు కోటిని సంహరిద్దామని కాదు. ఎదో పుష్ప సౌరభంకోసం అడివి అంతా గాలిస్తూ వున్నాడతను. పువ్వు లేనిచోటునుంచి ఆ పుష్పసౌరభం వస్తూ వున్నట్టుకూడా అతను మఱీ మఱీ కనిపెట్టి ఏమిటా యీవింత అని అట్టె అనుకోని ధనుష్టంకారము ఊరికేనే గావిస్తూ వుండేవాడు. చేరువనే సంపెగపువ్వు చూచి ఆపువ్వా అని దాన్ని త్రుంచి మూచూచి నప్పటికిన్నీ ఇంకా దాన్నిమించి ఎదోపువ్వుల పరిమళము అపూర్వమైంది అతనికి తగులుతూ వచ్చేది. ఇలాగ్గా తనయొక్క వెమకులాటలో కన్నప్ప అడివి అంతా తిరగేసి మరగేసి నిశ్చలంగా వున్న చాయ నొకదాన్ని మాత్రమే తెలుసుకొన్నాడు. ఎట్టకేలకు! గుహ! గుహముందు పెద్దసాలిగూడు. ప్రచండ ఝంఝూనిలం విసరుతూ వున్నా ఆసాలిగూడు కదలడం లేదు వదులవడంలేదు. తెగడంలేదు. ఊగడంలేదు. ఆలా సన్నని యొల్లెలా, ఆరగట్టిన మల్లెపూలా, కనబడుతూ తనలోనుంచి ఓ మహా లింగ స్వరూపాన్ని గోచరింప జేసింది. ఆ మహా లింగ స్వరూపాన్ని ఓతట్టు దంతావళం, ఓతట్టు కాలసర్పం అర్చిస్తూ వున్నాయి. కాల సర్పానికి బుసాలేదు. దంతావళానికి తృషాలేదు. బోయకన్నప్ప విల్లుడించి ముకుళితహస్తుడై 'శ్రీకాళహస్తీశ్వరా! నమస్తే! శ్రీకాళహస్తీ శ్వరా నమస్తే! శ్రీకాళహస్తీశ్వరా! నమస్తే!" అని ముమ్మాఱు మ్రొక్కి వెనక్కి తగ్గాడు.

జ్ఞానాంబ ఆగుహనుండి ఆ మాయా శ్రీ అమ్మటే యువతలకు చక్కా వచ్చి తనయొక్క నల్లని కచభరాన్ని, ఆకాశము నుండి చుక్కల్ని

రాలుస్తూ వుందా అన్నట్టు విదిర్చింది. విదిర్చే విదర్చడంలో జుత్తునే వంకనూ పువ్వులు కనిపించలేదు గాని, సహస్రకోటి వివిధ పుష్ప మంజరులూ తురిమిన కొప్పు సవరించు కొన్నప్పుడు గుప్పుమన్న చొప్పు, చెప్పజాలని సురభిళం ప్రభవించి భూ నభోంతరాళాన్ని గంధవహుడు చాల డన్నట్టు ఆవరించి వేసింది.

జ్ఞానాంబను అడిగినాడు బోయకన్నప్ప "తల్లీ ! ఆ శివలింగాన్ని ఆ మూటితో ఆ మట్టుగా నా యింటికి గొంపోయి పూజించుకుంటాను" అని. జ్ఞానాంబ అన్నది 'శివలింగము మాటటుంచు, పాము మాటటుంచు, ఏనుగు మాటటుంచు, ఈ సన్నని సాలిగూటి యొక్క వొక్క పోగును వెలితి సేసి తీసికొని పోగలవుటోయీ ! బోయడా ! వలసినచో నేను నీతో వత్తును. నన్నుగొని పొమ్ము" అన్నదిజ్ఞానాంబ.

అనవుడు బోయకన్నప్పన్నాడు "తల్లీ ! నిన్ను మునుముందుగా కల గుట్టుగా నా నట్టింట నెలకొల్పుకొన్న వాణ్ణయి యేవే యింతదూరం రాగలిటిలా" అన్నాడు.

జ్ఞానాంబ తిరోహతురాలైంది. కన్నప్ప మూలంగా అక్కడో విశాలమైన గుడి వెలిసింది. ఎత్తైన గోపురం నిలిచింది. ఎక్కువైన దివ్యక్షేత్రం బలిసింది. కన్నప్ప కల మొక్క మొలిచింది.

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 6—12—1937 | కాళహస్తి | "ఆంధ్రభూమి"లో |